01ATP21FF_01ATP21FF.qxd 21-02-2023 PM 11:04 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 22 ఫిబ్రవరి 2023 | పేజీలు : 04


# నామినేషన్ దాఖలుకు తరలి రండి

## - రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపు



రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**రాప్తాడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

వైఎస్ఆర్‌సిపి మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సానిపల్లి మంగమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. నామినేషన్ కార్యక్రమానికి రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని ఎంపిపిలు, జడ్పిటిసిలు, మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, ఉదయం 9 గంటలకు అనంతపురంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

సమావేశం అనంతరం 11 గంటలకు నామినేషన్ వేసేందుకు బయల్దేరనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సేవాతత్పరులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, సానిపల్లి మంగమ్మను ఎమ్మెల్సీలుగా గెలిపించి, జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# ఎన్నికల్లో చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దు



ఎన్నికల కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, జెసి టి.ఎస్.చేతన్, ఆర్‌డిఓ తదితరులు

**పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

ఎన్నికల్లో ఎలాంటి చిన్న పొరపాట్లకు కూడా తావ్వివరాదని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ సంబంధిత అధికారులను సూచించారు. మంగళవారం పుట్టపర్తి పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ముందస్తు ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, ఆర్‌డిఓ భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, జిల్లాలో గ్రాడ్యుయేట్స్ ఓటర్లు 43,000, ఉపాధ్యాయులకు 3,200 మంది ఓటర్లు ఉన్నారన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల యందు లైటింగ్ ఏర్పాట్లను చూడాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 86 పోలింగ్‌స్టేషన్లలో ఏర్పాట్లు చేశామని, 11 రూట్లు గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభావతి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి : డిఆర్‌ఓ కొండయ్య**

జిల్లాలో మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సెక్టార్ మరియు రూట్ ఆఫీసర్లు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య సూచించారు. మంగళవారంకలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సెక్టార్ మరియు రూట్ ఆఫీసర్లకు సంబంధించి సెక్టార్ మరియు రూట్ ఆఫీసర్లకు సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహనకల్పించి తగు సూచనలు జారీ చేశారు. సెక్టార్ అధికారులు ప్రణాళిక బద్ధంగా ఆయా పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి అవసరమైన మేరకు సౌకర్యాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలన్నారు. ఇదివరకే ఎన్నికల నిర్వహణ విధులు నిర్వర్తించిన అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని యధావిధిగా విధులు నిర్వహించాలన్నారు. ఈ అంశాలలో ఈ నెల 24లోగా నివేదికల రూపంలో తనకు సమర్పించాలనిపోలింగ్ సామాగ్రి మార్చి 12లోగా తరలిచేందుకు వాహనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సులను పుట్టపర్తి ప్రధాన కేంద్రంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రూట్ ఆఫీసర్లు కూడా తమకు అప్పగించిన పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, అలాగే ఆయా మండలాలకు సంబంధించిన పిఓలకు, ఎపిఓలకు అందుబాటులో ఉండి ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్‌మైనుద్దీన్, సెక్టార్ మరియు రూట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబి వలలో గాండ్లపర్తి విఆర్‌ఓ



గాండ్లపర్తి విఆర్‌ఓ నరసింహులు



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఏసిబి అధికారులు

**రాప్తాడు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

రాప్తాడు మండలం జి.కొత్తపల్లి పంచాయితీకి చెందిన యాలేటి ప్రదీప్‌కుమార్‌రెడ్డి తండ్రి లక్ష్మిరెడ్డికి గాండ్లపర్తి రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 14-7లో 5.50 ఎకరాల డి-పట్టా భూమి ఉండేది. ప్రదీప్‌కుమార్‌రెడ్డి తన తండ్రి అనారోగ్యంతో 11-01-2021న మరణించారు. అతని తండ్రి చనిపోయిన కొన్ని నెలల తర్వాత, అతని తల్లి లక్ష్మిదేవి తన పేరు మీద పై భూమిని మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసింది. ఈ భూమికి సంబంధించి ఫారం-1బి, అడంగల్లు జారీ చేసినా ఈ భూమికి సంబంధించిన పాసు పుస్తకం అందలేదు. మొదట జనవరి 18న ఫిర్యాదు దారు తల్లి గాండ్ల పర్తి సచివాలయ కార్యాలయం ద్వారా పాసుబుక్ రీప్లేస్‌మెంట్ కొరకు దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తుతోపాటు బూమికి సంబంధించిన అన్ని పత్రాలు అందజేసినా కూడా కారణం లేకుండా అప్లికేషన్ తిరస్కరించడం జరిగింది. ఈ విషయమై గాండ్లపర్తి విఆర్‌ఓ నరసింహులుని ఫిర్యాదు దారుడు కలవగా పాసు బుక్కు మంజూరు కొరకు రూ.4వేలు లంచం డిమాండ్ చేశాడు. ఈ విషయమై ఫిర్యాదు దారుడు అవినీతి నిరోధక శాఖ వారి టోల్‌ఫ్రీ నెంబర్ 14400కి ఫిర్యాదు చేయగా అనంతపురం ఏసిబి ఆఫీసు వారు తక్షణమే స్పందించి డిఎస్‌పి కంజాక్షన్ ఆధ్వర్యంలోనింధితుడు ఫిర్యాదు దారుడి వద్ద నుంచి రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామంలోనిగ్రామ సర్పంచు నివాసంలో రూ.4వేలు లంచం డబ్బు తీసుకుంటుండగా వల పన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్‌పి కంజాక్షన్ మాట్లాడుతూ.. ఎవరైనా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి లంచం డబ్బు డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 100కి గాని, ఏసిబి మొబైల్‌యాప్‌లో గానిఫిర్యాదు చేసి తగిన న్యాయం పొందవలసిందిగా తెలియజేశారు. ఈ రైడ్‌లో ఎసిబి డిఎస్పీ కంజాక్షన్‌తోపాటు అనంతపురం ఏసిబి ఇన్స్‌పెక్టర్ మోహన్ ప్రసాద్, శంకర్‌రెడ్డి, శాంతిలాల్, శివ గంగాధర్‌రెడ్డి, ఎస్‌ఐలు హరినాథ్‌రెడ్డి, నరేంద్ర భూపతి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్కేయూలో మృత్యుంజయ హోమం

**- ప్రభుత్వ సంస్థల్లో హోమాలు నిర్వహణపై వెల్లువెత్తుతున్న నిరసనలు**

**- వైస్‌ఛాన్స్‌లర్ ఆరోగ్యం కోసమే యాగాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలు**




**ఎస్కేయూ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో మృత్యుంజయ హోమం నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంప్యూటర్ యుగంలో హోమాలు ఏమిటనే వాదనలు ఉన్నాయి. అయితే ఉద్యోగుల సంక్షేమం కోసమే యాగం నిర్వహిస్తున్నామని వైస్ ఛాన్సలర్ ప్రొ.రామకృష్ణారెడ్డి పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం యూనివర్సిటీలో యాగాలు, హోమాలు చేయకూడదు. గతంలో కొన్ని యూనివర్సిటీల్లో నిర్వహిచడంతో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఆధునిక యుగంలో కూడా మూఢనమ్మకాలు పాటిస్తారా అని విద్యార్థులు పేర్కొంటున్నారు. మేము చదవకుండా పాస్ కావాలంటే హోమంచేస్తే సరిపోతుందా అని విద్యార్థులు పేర్కొంటున్నారు. అయితే హోమాలు గుడిలో నిర్వహిస్తారు. లేదా వారి వారికి సంబంధించిన ఇళ్లల్లో నిర్వహిస్తే సరిపోతుంది కదా అనే వాదనలు యూనివర్సిటీలో ఉన్నాయి. ఉద్యోగుల పేరిట గుడిలో హోమంనిర్వహించాలని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. మొత్తంగా ఈ అంశంపై యూని వర్సిటీలో పెద్ద చర్చ సాగుతోంది. ఈ అంశంపై యూనివర్సిటీ అధికారులు ఒక జీవో జారీ చేసి, డబ్బుల వసూళ్ల కోసం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను నియమించడంపై పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. అయితే యూనివర్సిటీ అధికారులు స్వచ్చందంగా ఇవ్వచ్చు. డబ్బులు ఇవ్వకపోయినా పాల్గొనవచ్చు అన్నా కూడా ఈ నిరసనలు ఆగడం లేదు. మొత్తంగా ఈఅంశంపై గవర్నర్ దృష్టికి తేవాలని పలు విద్యార్థి సంఘాలు ఇప్పటికే అమరావతి బయల్దేరి వెళ్లారు.

**హోమాన్ని అడ్డుకుంటాం :**

ఎస్కేయులో మృతు ంజయ హోమాన్ని అడ్డుకుంటామని ఇప్పటికే ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎ, ఎన్ఎస్‌యుఐ, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థల్లో యాగాలు చేయడమేంటని నిలదీస్తున్నారు. అవసరమనుకుంటే గుళ్లో చేయాలని పేర్కొంటున్నారు. లేకపోతే విసి ఇంటిలో చేయాలని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో విసికు గండం ఉందని పేర్కొనడంతో ఆయన క్షేమం కోసమే ఈ యాగాలు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా యూనివర్సిటీలో యాగం నిర్వహిస్తే కచ్చితంగా అడ్డుకుంటామని పేర్కొంటున్నారు. మరోవైపు ఏబివిపి విద్యార్థి సంఘ నాయకులు యాగం నిర్వహించాలని మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘ నాయకులు కొట్టుకునే ప్రమాదం కూడా లేకపోలేదు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా యూనివర్సిటీ అధికారులు హోమంకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాగైనా అడ్డుకుంటామని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. ఈ అంశంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ఉద్యోగుల సంక్షేమం కోసం యాగం తప్పకుండా నిర్వహిస్తామని విసి పేర్కొంటున్నారు.

# కలప అక్రమ రవాణాకు అడ్డేది..

## - కలప వ్యాపారులతో అధికారులు కుమ్మక్కు - విచ్చలవిడిగా అక్రమ కలప రవాణా



ట్రాక్టర్‌లో అక్రమంగా కలప రవాణా చేస్తున్న దృశ్యం

**హిందూపురం టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

జిల్లాలో 33 శాతం అటవీప్రాంతం విస్తీర్ణం వుండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేసి అటవీప్రాంతాన్ని పెంచేందుకు కృషి చేస్తుంటే అవినీతికి అలవాటుపడిన కొందరు అధికారులు కలప వ్యాపారులతో చేతులు కలిపి వున్న చెట్లను ఎధేచ్ఛగా నరికిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. చెట్లను సంరక్షించాల్సిన అధికారులే కలప వ్యాపారులతో చేతులు కలిపితే ఇక అడ్డేముంది ప్రతి చెట్టు గొడ్డలి వేటుకు గురికాకతప్పదుమరి. చెట్ల ఆవశ్యకత పట్ల అవగాహన పెంచుతూ వనాలను నరకనని నరకనివ్వనని విరివిగా మొక్కలు నాటుతానని ఊరూరా ఇంటా బయట మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరిస్తానని ప్రతిజ్ఞ చేసిన అధికారులే పట్టపగలే పచ్చని చెట్లను నరికిస్తూ జేబులు నింపుకుంటున్నారన్నది బహిరంగ రహస్యం. హిందూపురం పరిసర ప్రాంతాల్లో అక్రమ కలప రవాణాకు అడ్డు అదుపు లేకుండా మూడు పూలు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. హిందూపురం రూరల్, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండలాల నుండే కాకుండా కర్నాటక రాష్ట్రం నుండి ప్రతి రోజు ట్రాక్టర్ల ద్వారా అక్రమ కలప రవాణా జరుగుతోంది. సంబంధిత అటవీశాఖ అధికారులు కలప రవాణా చేసే ఒక్కొక్క ట్రాక్టర్ నుండి వెయ్యి రూపాయలు మామూలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా రోజుకు దాదాపు పట్టణానికి పది ట్రాక్టర్ల అక్రమ కలప రవాణా జరుగుతోందంటే వ్యాపారులకు అధికారుల అండదండలు ఏ స్థాయిలో వున్నాయో అర్థమవుతోంది. అంతేకాకుండా పట్టణంలో దాదాపు 10 సామిల్లులు వుండగా ఇందులో ఒక్కొక్క సామిల్లు నుండి నెలకు 12 వేల రూపాయలు అటవీశాఖ అధికారులు మామూళ్ల వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాల్లో చర్చ. ఇక పరిశ్రమల నుండి కూడా అధికారులకు మామూళ్లు అందుతున్నాయి. రూరల్ ప్రాంతంలో గల కెమికల్ తదితర మెడిసిన్ పరిశ్రమల నుండి ఒక్కొక్క పరిశ్రమ నుండి 15 వేల రూపాయలు మామూళ్లు మధ్యవర్తుల ద్వారా అధికారులకు చేరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అటవీశాఖ అధికారులు సామిల్లులపై తనిఖీలు, అక్రమ కలప రవాణాపై దృష్టి పెట్టిన దాఖలాలే లేవు. పచ్చని చెట్లు నరుకుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న అవినీతి అధికారుల భాగోతంపై ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి మరి. ఇదే విషయంపై జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డిని ప్రభాతవార్త వివరణ కోరగా అధికారులు మామూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# అనంతపురం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వార్షిక తనిఖీ

## - అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని అనంతపురం రేంజ్ డిఐజి ఎం. రవిప్రకాష్ ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లితో కలిసి మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం, స్పెషల్ బ్రాంచి, డీసీఆర్బి, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం తదితర విభాగాలలో అన్ని రికార్డులను, పనితీరును లోతుగా ఇన్స్‌స్పెక్షన్ చేశారు. జిల్లా స్పెషన్ బ్రాంచి పటిష్టమైన సమాచార వ్యవస్థతో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. భూ కబ్జాదా రులు, అరాచక శక్తుల, కిరాయి హంతకుల ముఠాల కదలికలపై నిఘా వేయాలన్నారు. ఫ్యాక్షన్ నియంత్రణ కోసం నిరంతరు నిఘా కొనసాగించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలు, ఫ్యాక్షనిస్టులు, వీరి అనుచరుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలిటికల్ వైరి వర్గాలు,పొలిటికల్ ట్రబుల్ మాంగర్స్ పట్ల దృష్టి సారించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అసాంఘీక శక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచార సేకరణపై దృష్టి పెట్టాలన్నారు. సిసిటిఎన్ఎస్‌లో వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, ఎస్‌హెచ్‌ఆర్‌సి/ఎన్‌హెచ్‌ఆర్‌సి పిటీషన్లపై నిర్లక్ష్యం లేకుండా చట్ట పరంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐజి, ఎస్పీలతోపాటు అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, సిఐలు తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిసుత్న అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్

# సత్యసాయి జిల్లా కలెక్టర్ బసవంత్‌కుమార్ ఆకస్మిక తనిఖీ

**రొద్దం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

రొద్దం మండల పరిధిలోని చోలేమర్రి , చిన్నమంతూరు కలిపి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గుత్తేదా రులును ఆదేశించారు. అలాగే సచివాలయాల్లో రికా ర్డులను పరిశీలించారు.

సచివాలయ సిబ్బంది ప్రజల సమస్యల పరిష్కారం అందు బాటులో ఉండి పరిష్కరించాలని అధికారులకు సిబ్బందికి ఆదేశించారు. అదేవి ధంగా ఆర్‌బికె కేంద్రాల్లో ఎరువులు విత్తనాలు, కందులు పంటలకు పిచికారి చేసే మందును ఎంత వరకు అందు బాటులో ఉన్నాయో స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతచారి, ఎంపిడిఓ రాబర్ట్ విల్సన్ ఆయా సచివాలయ అధికారులు, సిబ్బంది భవన నిర్మాణ గుత్తేదారులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ నిర్వహిస్తున్న కలెక్టర్



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

# సీఎం జగన్‌రెడ్డి ఏపిని బీహార్ చేస్తున్నారు

## - ఇంతకన్నా అరాచకం ఎక్కడైనా చూశారా - గన్నవరం ఘటనపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి పరిటాల సునీత

**అనంతపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త బ్యూరో**

ప్రశాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి రావణకాష్టంలా మారుస్తున్నారని అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ మ ంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వైసీపీ వర్గీయుల దాడి పట్ల సునీత తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నేతలపైనే దాడులకు పాల్పడటమే కాకుండా ఇప్పుడు ఏకంగా పార్టీ కార్యాల యాల వద్ద విధ్వంసాలు సృష్టించే వరకు వైసీపీ నేతలు వెళ్లారన్నారు. పోలీసులు గన్నవరంలో విధ్వంసానికి పాల్పడిన వైసీపీ శ్రేణులను వదిలేసి, టిడిపి వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి అరెస్టులు చేయడం ఏంటని ఆమె ప్రశ్నించారు. పోలీసులు మరి ఇంత దిగజారి ఒక పార్టీకి కొమ్ముకాయడం గతంలోఎప్పుడూ చూసి ఎరుగమని సునీత అన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేసి, అక్కడ కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం చేశారన్నారు. అంతటితో ఆగకుండా ఆఫీస్ ఆవరణంలో ఉన్న వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పు అంటించారన్నారు. కత్తుతో టీడీపీ ఫ్లెక్సీలను వైసీపీ కార్యకర్తలు చించి వేసి, ఓ కారు అద్దాలను ఇటుకలతో బద్దలు కొట్టి భీభత్సం సృష్టిస్తుంటే పోలీసులు ఏం చేశారని నిలదీశారు. జగన్ మార్క్ అరాచకాన్ని సంస్కృతిని, దౌర్జన్యాలను ఇక్కడ చూపించారన్నారు. పట్టాభిని పోలీసులు అరెస్టు చేసి, ఎక్కడ ఉంచారో చెప్పకుండా హింసించి ఈ రోజు సాయంత్రం కోర్టులో హాజరు పరిచారన్నారు. అంతకు ముందు వారి కుటుంబ సభ్యులు అల్లాడిపోతున్నా పోలీసులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. గన్నవరం ఘటనకు పూర్తిగా జగన్‌రెడ్డి, వల్లభనేని వంశీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బోడే ప్రసాదును దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారని, జిల్లా ముఖ్య నాయకులు కొంత మందిని గృహ నిర్బంధం చేసి, మరి కొంత మందిని ఎక్కడికక్కడ అరెస్టులు చేసి, కార్యకర్తలను, నాయకులను లాక్కెళ్లారని మండి పడ్డారు. ఈ సంఘటనలన్నీ చూస్తుంటే రాష్ట్రంలో పరిపాలన, చట్టం లేదని, డిజిపి ఆఫీస్ మూసేసుకున్నారా అన్న అనుమానం కలుగుతోందన్నారు. గన్నవరం ఘటనలో దాడులు చేసిన గూండాలను, వల్లభనేని వంశీని అరెస్టు చేయాలన్నారు. ఇప్పటికైనా ఈ దాడులుచేసిన వారిని కఠినంగా శిక్షించి పోలీసు వ్యవస్థ ఉందన్న నమ్మకాన్ని కలిగించాలని పరిటాల సునీత డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

# జర్నలిస్టు వి.రఘు కిశోర్ సేవలు భావితరాలకు ఆదర్శం

**అనంతపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త బ్యూరో**

బహుముఖ ప్రజ్ఞాశాలి, మానవతావాది, ప్రముఖ జర్నలిస్టు వి.రఘు కిశోర్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని, భావితరాలకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తారని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలస్టు (ఏపియుడబ్ల్యుజే) ఆధ్వర్యంలో మంగళవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన వి.రఘుకిశోర్ సంతాప సభలో పలువురు రాజకీయ ప్రముఖులు, సీనియర్ జర్నలిస్టులు, రఘు సమకాలికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు సి.విశ్వనాథ్, ఆజాద్, మార్కాండేయులు, ప్రభాకర్‌నాయుడు, భోగేశ్వర్‌రెడ్డి, టి.రామాంజినేయులు మాట్లాడుతూ.. జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకున్న కిశోర్ వృత్తిపట్ల అంకితభావంతో సమాజ సేవకు జీవితాన్ని ధారపోశారనితెలిపారు. తొలినా లలో కమ్యునిస్టు పార్టీలో పనిచేసిన రఘుకిశోర్ ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచారని చెప్పారు. విశాలాంధ్ర, సాక్షి, ఆంధ్రజ్యోతి, వార్త పత్రికల లోవివిధ స్థాయిల్లో పని చేసి కిశోర్ వార్తలతో సమాజాన్ని చైతన్య పరిచా రని, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారని తెలిపారు. ఈ నెల 12న తన 67వ జన్మదినాన్ని జరుపుకున్న రఘు కిశోర్ ఈ నెల 15న తుదిశ్వాస విడిచారని చెప్పారు. రఘు భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన ఆశయాలు జర్నలిజంలో ఆయన సాధించిన విజయాలు భావతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్టూన్ల, రచనల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని గుర్తు చేసుకున్నారు. కిశోర్ సమకాలికులు వి.కె.గంగారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో మార్పు రావాలంటే జర్నలిస్టుల పాత్ర కీలకమని చెప్పారు. కిశోర్ పాత్రికేయుడుగానే కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలి, మానవతావాదిగా గుర్తింపు పొందారని, తన వృత్తికి న్యాయం చేయాలని నిరంతరం పరితపించే వారని చెప్పారు. వైసీపీ నాయకులు కెవి.రమణ మాట్లాడుతూ.. రఘుకిశోర్ లాంటి జర్నలిస్టులు సమాజంలో అరుదుగా ఉంటారని, నిబద్ధతగల పాత్రికేయుడని కొనియాడారు. రఘు కిశోర్‌తో కలిసి వివిధ పత్రికల్లో పని చేసిన పాత్రికేయులు ఆయనతో తమకున్న బంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఏపిడబ్ల్యూజే నాయకులు పయ్యావులప్రవీణ్, బుడ శ్రీనివాస్‌రెడ్డి, చౌడప్ప, కెపి. కుమార్, ఎలక్ట్రానిక్ మీడియాజిల్లా అధ్యక్షులు రసూల్, సనప రామకృష్ణ, ప్రదీప్‌రెడ్డి, శివయ్య, నవీన్‌కుమార్‌రెడ్డి, పసూలూరి ఓబులేసు, షేక్ బికారి, సబ్ ఎడిటర్ షఫి, బాలకృష్ణముదిరాజ్, రాజశేఖర్, జె.ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టులు తదితరులు

02ATP27_02ATP27.qxd 21-02-2023 PM 10:56 Page 1



## వైసీపీ రౌడీ మూకల అరాచకం వల్ల రాష్ట్రం రావణ కాష్టంలా మారింది

### - టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి


మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి

**కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఉన్నం క్యాంపు కార్యాలయంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ కార్యాలయంపై వైఎస్ఆర్‌సిపి చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నారా చంద్రబాబునాయుడు నివాసంపైన తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపైన అధికార ప్రతినిధి పట్టాభిరామ్ ఇంటిపైన దాడి చేసినప్పుడు ప్రభుత ం నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ రోజు ఈ సంఘటన జరిగి ఉండేది కాదన్నారు. పోలీసులు సమక్షంలోనే తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి, వాహనాలను పెట్రోల్ పోసి కాల్చడం ఇలాంటి చర్యలన్నీ పోలీసులు సమక్షంలో జరగడం వారి వైఫల్యానికి పూర్తి నిదర్శనమన్నారు. ఇంత జరిగినా కూడా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపైనే హత్య ప్రభుత్వం కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, బనాయించడం పూర్తి అభ్యంతరకరం, దీనిపై నిరసన తెలియజేయడానికి నేడు గన్నవరానికి వెళ్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు ఆర్.జి.శివశంకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పాపంపల్లి రామాంజినేయులు, మాజీ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ డికె రామాంజినేయులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, మాజీ అక్కమ్మగార్ల ఆలయ కమిటీ చైర్మన్ గొర్ల గోవిందప్ప, కొత్తూరు పోతులరాజు, గోళ్లరాము, పట్టణ బేల్దారి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ఆకస్మిక తనిఖీ


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఓ

**శెట్టూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మండల అభివృద్ధి అధికారి ఎస్.గంగావతి బచ్చేహళ్లి, కైరేవు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఇందులోభాగంగా ఆయుష్మాన్ భారత్ రిజిష్ట్రేషన్, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సర్వే, హౌస్ టాక్స్ పురోగతిని తెలుసుకుని సత్వరమే పూర్తి చేయాలని, ఆదే విధంగా బయోమెట్రిక్ అటెండెన్స్, యూనిఫామ్ ప్రతిరోజు క్రమం తప్పకుండా పాటించాలని సూచించడం జరిగింది. ఎవరైనా సరే నియమాలు పాటించనిచో వారికి శాఖాపరమైన చర్యలు చేపడుతామని ఎంపిడిఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండు పంచాయితీల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి కానిస్టేబుల్ మూడు చక్రాల సైకిల్ సహాయం


సైకిల్‌ను వితరణ చేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : పట్టణానికి చెందిన చాకలి నరసింహులు అనే దివ్యాంగుడికి రూరల్ సర్కిల్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ రాము, మూడు చక్రాల సైకిల్ వితరణ చేశారు. తన వంతు ఒక దివ్యాంగుడికి సహాయం చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని రాము తెలిపాడు. ఈ సందర్భంగా వికాలంగుల యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## మామడూరులో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం


వివరిస్తున్న పశువైద్యాధికారి

**బ్రహ్మసముద్రం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త,** : మామడూరులో లేగదూడల ప్రదర్శన కార్యక్రమంను పశువైధ్యాదికారి నార్యనారాయణరెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అనంతపురం డియల్‌డిఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విచ్చేసి పాడిరైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు కృత్రిమ లింగనిర్దారణ కార్యక్రమంలో భాగంగా 90 శాతం పైదూడలు పుట్టేలా వీర్యం అందుబాటులోవుదని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.22 పశువులకు గర్భకోశ వ్యాదికి చికిత్సలు అందించి మందులు అందించారు లేగదూడల పెంపకం వాటి రక్షణ వంటివాటిని రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు

## పంట వేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి


పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

**లేపాక్షి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : రబీ 2022-23 సంవత్సరానికి గాను లేపాక్షి మండలంలో పంట నమోదు ఇప్పటి వరకు 903 మంది రైతులకు గాను 1142 ఎకరాల్లో పంట నమోదు చేయడం జరిగిందని ముఖ్యంగా ఈ నెల 25వతేదీలోపు పంట వేసిన ప్రతి రైతు ఆయా ఆర్‌బికెల్లో సిబ్బందితో పంటనమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీలత మంగళవారం పేర్కొన్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాల వల్ల బోరుబావుల కింద వరి మరియు మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగుచేయడం జరిగిందన్నారు. కావునా రబీలో పంట వేసిన ప్రతి రైతు కూడా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకుని ఈకెవైసి కూడా నిర్ణీత గడువులోపు సంబంధిత ఆర్‌బికె సిబ్బంది వద్ద చేయించుకోవాలని ఎఒ తెలిపారు.

## బిజెపి ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించండి


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**చిలమత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : పశ్చిమరాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా బిజెపి తరుపున పోటీ చేస్తున్న రాఘవేంద్ర నగరూరును గెలిపించాలని బిజెపి మండల అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్ రమణ మూర్తి, విస్తరక్ భాస్కర్‌లు మంగళవారం ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక కళాశాల, రాష్ట్ర కార్యాలయాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తూ బిజెపి అభ్యర్థి రాఘవేంద్ర నగరూరుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు రామకృష్ణ, హరిప్రసాద్, కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, ఒబిసి మండల అధ్యక్షులు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## రాతిదూళం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు


రాతిదూళం లాగుతున్న దృశ్యం

**బొమ్మనహాళ్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మండల పరిధిలోని గోవిందవాడ గ్రామంలోగల శ్రీ ఎణ్ణే రంగనాథస్వామి రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఆటల పోటీలు నిర్వహించినట్లు ఆలయ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రారంభించినట్లు గ్రామస్తులు తెలిపారు. వాలీబాల్ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి నగదు అందజేసినట్లు టీడీపీ నాయకుడు సోమనాథ్‌గౌడ్ తెలిపారు. వాలీబాల్‌ప్రథమ బహుమతిగా దర్గా హొన్నూరు గ్రామస్తులు కైవసం చేసుకున్నారని, రెండవ బహుమతి, మూడవ బహుమతి గోవిందవాడగ్రామస్తులు గెలుచుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం రాతిదూళం పోటీలు నిర్వహించగా ఈ పోటీల్లో ఏడు గ్రామాలకు చెందిన రైతు సోదరులు రాతిదూళం లాగుడు పోటీల్లో పాల్గొన్నట్లు ఇందులో మొదటి బహుమతి, విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామానికి చెందిన, భీమ లింగేశ్వర 20వేలు, రెండవ బహుమతి ఆత్మకూరు గ్రామానికి చెందిన జెపిఎం బల్స్ 15వేలు, మూడవ బహుమతి పెంచలపాడు గ్రామానికి చెందిన భీమలింగేశ్వర రూ.10వేలు ఈ బహుమతుల్లో మొదటి బహుమతి, మూడవ బహుమతి స్థానిక టీడీపీ నాయకుడు సోమనాథ్‌గౌడ్, వారి సొంత నిధులు వెచ్చించి ఇచ్చినట్లు తెలిపారు. రెండవ బహుమతి పెద్ద సుంకన్న, ఎస్‌జె వన్నూరుస్వామి రూ.10వేలు అందజేసినట్లు వారు తెలిపారు. తిలకించడానికి వచ్చిన వారికి ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొంటి వన్నూరుస్వామి, మహాదేవ, బసప్ప, అయ్యన్న వన్నూరుస్వామి, జి.మూర్తి, భంగి లోకేష్, సర్మాస్‌హుస్సేన్, గ్రామస్తులు మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు రూ. 10,100 లు విరాళం


వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు విరాళం అందజేస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సేవా సమితి అధ్యక్షులు నాయకులు బండి కిష్టప్ప విరాళం విరాళం వితరణ చేశారు. మంగళవారం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు వారి స్వగృహంలో బొమ్మనహాళ్ మండలం కురువపల్లి గ్రామానికి చెందిన వాల్మీకి సేవా సమితి యువత హరీష్ కుమార్ తదితరులతో కలిసి రూ. 10, 100 లు విరాళం అందజేశారు. ఏలాంటి తారతమ్య బేధాలు లేకుండా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఐక్యమత్యంతో ద్విగిజయంగా నేరవేర్చాలని ఆయన సూచించారు. విరాళం అందుకున్న ఆ గ్రామ వాల్మీకి సంఘం సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కోట్లకు పడగలెత్తిన మహానుభావులు ఎందరో ఉన్నారని సహాయం చేసే గుణం కొంత మందికే ఉందని కష్టపడి ఒక స్థాయికి ఎదిగిన మీరు మాత్రమే ఎన్నో పుణ్యం సేవా కార్యక్రమాలకు విరాళం అందించి అందరి మన్ననలు పొందుతున్నారని ఈ సందర్భంగా వారు ఆయన సేవలను కొనియాడారు. భగవంతుని తోడు ఎల్లప్పుడు ఉండాలని విరాళం అందుకున్న వాల్మీకి సోదరులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి ఎన్‌టి. సిద్దప్ప, ఉపాధ్యక్షులు మల్కన్న, వాల్మీకి యూత్ లీడర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షలు విలువ చేసే డ్రిప్ వైర్లు చోరీ

**బెలుగుప్ప, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మండల పరిధిలో ఆవులన్న గ్రామంలో లక్షలు విలువ చేసే డ్రిప్ వైర్లను సోమవారం రాత్రి డ్రిప్‌వైర్లు చోరీ అయ్యాయి. వివరాల మేరకు 5 మంది రైతులు తోటలో పని చేస్తున్న డ్రిప్‌వైర్లు, కేబుల్ వైర్లు, స్టార్టర్లు మొత్తం చోరీకి గురైందని, బెలుగుప్ప సబ్ ఇన్స్‌పెక్టర్ ఎ.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మీ పొలాలలో ఉండే డ్రిప్ వైర్లను ఇంటిలోగానీ, ఇంటిపైన గానీ పెట్టుకోవాలని ఇతర రైతులకు కూడా సూచించారు. ఈ డ్రిప్ వైర్లు పోయినాయి కాబట్టి ఒకసారి మీ పొలాల్లోకి వచ్చి చూసి ఆరాతీస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవులన్న గ్రామ రైతులు నారాయణస్వామి, తిప్పేస్వామి, దస్తగిరి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ తనిఖీ

**బెలుగుప్ప, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మండల పరిధిలో అంకంపల్లి గ్రామంలో ఆకస్మాత్తుగా సిడిపిఒ లక్ష్మిప్రసన్న తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడానికి అంగన్‌వాడీలు చాలా దూరంగా ఉన్నాయని, వారి ఇళ్ల వద్దకే పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకి తెలిపారు. రికార్డులను కూడా తనిఖీ చేశారు. చిన్న పిల్లల వివాహాలు అరికట్టాలని, వచ్చిన వారి తల్లిదండ్రులకు సలహాలు, సూచనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య


మృతి చెందిన హరికృష్ణ

**చిలమత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ పెద్దన్నపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ (19) అనే యువకుడు మంగళవారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడైన హరికృష్ణ కడుపునొప్పితో బాధపడుతూ మనోవేదనకు గురయ్యేవాడన్నారు. ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నాడు. తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సుంకులమ్మదేవి రథోత్సవానికి ఆహ్వానం


ఎంఎల్‌సి శివరామిరెడ్డిని ఆహ్వానిస్తున్న వైసిపి నాయకులు

**విడపనకల్లు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మండలంలోని పాల్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుంకులా పార్వతీదేవి రథోత్సవం ఈ నెల 24వతేదీన జరగనుందని ఈ కార్యక్రమానికి తప్పక రావాలని మంగళవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని ఎంఎల్‌సి శివరామిరెడ్డి స్వగృహానికి వెళ్లి పాల్తూరు వైసిపి నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రథోత్సవ పోస్టర్‌ను ఎంఎల్‌సి శివరామిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. అనంతరం రథోత్సవానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సుంకన్న, మాలింగ, ఓబులేసు, రామకృష్ణ, షబ్బీర్, రాజన్న, మంజు, శ్రీనివాసులు, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## కాలవా ప్రభుత్వంపై విమర్శలు తగవు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డ్ చైర్మెన్ బోజరాజునాయక్

**డి.హిరేహాళ్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మాజీ మంత్రి కాలవ తనవునికిని చాటుకునేందుకు వైకాపా ప్రభుత్వంపై బురద చల్లేందకు కంకణం కట్టుకున్నారని రాయదుర్గం ప్రజలు గత ఎన్నికల్లో ఓటుతో బుద్ది చెప్పినా మారక పోవడం రాయదుర్గం ప్రజల దురదృష్టమని రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మెన్ బోజరాజునాయక్ విమర్శించారు. మంగళవారం డి.హిరేహాళ్ మండలం కేంద్రంలో దివంగత కాంగ్రెస్ నాయకుడు ఇబ్రహీంసాబ్ స్వగృహంలో కొందరు వైకాపా నాయకులతో కలసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి తమ ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను, రాయదుర్గం నియోజకవర్గం తమ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పాలనను చూసి ఓర్వలేక అసందర్భ వాక్యలు చేస్తే నియోజకవర్గం ప్రజలు వింటూ ఊరుకోరని ఆయన అన్నారు. మీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ప్రచారం పిచ్చితో అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు ఇంకా మరవలేదని ఇప్పుడు ముద్దపప్పు లోకేష్ యువగళం పాదయాత్రకు జనం రాకపోవడంతో తెదేపా నాయకలు పిచ్చి ప్రేలాపనలు పలుకుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. జగనన్న సిఎంగా దేశవ్యాప్తంగా అన్ని వర్గాల మేదావుల నుండి అందుకుంటున్న పాలనా పరమైన మన్ననలను ఓర్వలేక వైకాపా పాలనపై అందరిలోనూ వ్యతిరేకత అని మాజీ మంత్రి చేసిన వాఖ్యలను ఎవరూ నమ్మరని జగనన్న పాలనలో అన్నివార్గల అర్హులైన వారు లబ్ది పొందుతూ ఆర్థికాభివృద్ధి చెంతున్న వషయం మాజీ మంత్రి కాలవ మరిచారా అని ఆయన ప్రశ్నించారు. గత తెదేపా పాలనలో అక్రమ ఇసుక రవాణచేసి కోట్లు దండుకుని జోబులు నింపుకున్నది మీ పార్టీ నాయకుల కాదా మీరు చేసిన అక్రమాలను ఇప్పుడు మా ఎమ్మెల్యేకు అట్టగట్టడంలోనే మీ చాతుర్యాన్ని నిరూపించుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు సింగాడి జగదీష్, ఉపసర్పంచు కరిడి మల్లికార్జున, వైకాపా నాయకులు తొండ వెంకటేష్, సింగాడి మంజునాథ్, ఖాశీంపీరా, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న సర్పంచు దొణప్ప

**డి.హిరేహాళ్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : పంచాయతీ కార్యదర్శి రాజుతో కలసి సర్పంచు దొణప్ప మృతుడి కుటుంబానికి వై.ఎస్.ఆర్ బీమా పథకం ద్వారా అందాల్సిన తక్షణ ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం డి.హిరేహాళ్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన రజకుల వన్నూరుస్వామి ఆకస్మిక మరణం పొందారు. ఈ సమాచారం అందుకున్న సర్పంచు హుటాహుటీన మృతుడి స్వగృహంకు వెళ్ళి తన ప్రఘాడ సంతాపం వ్యక్తంచేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆ గ్రామ సచివాలయం కార్యదర్శిని సంప్రదించి దహన సంస్కారాలకు అందాల్సిన రూ.10000లు తక్షణ వై.ఎస్.ఆర్ బీమా సొమ్ము అందించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పి సంబంధిత అధికారులతో చర్చించి మీ కుటుంబానికి అందాల్సిన వై.ఎస్.ఆర్. బీమా సొమ్ము రూ.90000లు త్వరలోనే అందేల చూస్తానని తెలిపారు.

## ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు


వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

**లేపాక్షి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : పర్యాటక కేంద్రమైన లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలో ఈ నెల 17వతేదీ నుండి ప్రారంభమైన మహాశివ రాత్రి ఉత్సవాలు మంగళవారం వసంతోత్సవం, ధ్వజా అవరోహణ, శయనోత్సవంతో ముగిసినట్లు ఆలయ ఇఒ నరసింహమూర్తి తెలిపారు. లేపాక్షి ఆలయంలో నాలుగు రోజులుగా వివిధ కార్యక్రమాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, అర్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళహారతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వసంతోత్సవం, సాయంత్రం ఉయ్యాలలో స్వామివారి శయనోత్సవం నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసినసందర్భంగా ప్రజలు, ఆలయకమిటీ సభ్యులు దేవాదాయశాఖవారు ప్రత్యేకకృతజ్ఞతలుతెలిపారు. ముఖ్యంగా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవడం విశేషమని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


స్వామివారి శయనోత్సవం

## లేపాక్షిలో వైభవంగా ముత్యాలపల్లకి


ముత్యాలపల్లకిలో ఊరేగుతున్న స్వామివారు


కొలువుదీరిన శివపార్వతులు

**లేపాక్షి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో అనేక మంది భక్తుల నడుమ సోమవార ం రాత్రి ముత్యాలపల్లకి ఊరేగింపు అత్యంతవైభవంగా సాగింది. ఈ సందర్భంగా శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా నిర్వహించారు. దేవాలయం నుండి శివపార్వతులను పల్లకిలో తెచ్చి ముత్యాలపల్లకిలో కూర్చోబెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి మహమ్మద్‌ఇక్బాల్ పాల్గొన్నారు. ఎంఎల్‌సికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వైసిపి నాయకులు లేపాక్షి మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్‌పిటిసి బానాల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచు ఆదినారాయణ, వైస్‌ఎంపిపి అంజనరెడ్డిలు ఎంఎల్‌సిని సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు. గ్రామ పెద్దలు రథోత్సవ కమిటీ సభ్యులు ముత్యాలపల్లకి ఊరేగింపును ఆలయం నుండి ప్రారంభించి రాజవీధి, బస్టాండ్ నుండి ఎగువపేట నంది విగ్రహం, దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ముత్యాలపల్లకి కార్యక్రమంలో కీలుగుర్రాల ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అదేవిధంగా కట్టెలు కాళ్లతో హాస్యమైన నటనలతో అలరించారు. ప్రతివీధిలో స్వామి వారికి విశేషంగా పూజలు చేయడం విశేషం. అయితే పల్లకి సందర భ్ంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## విద్యార్థులకు తప్పిన పెనుప్రమాదం


పాఠశాల బస్సు ఇదే

**హిందూపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సు నుండి దాదాపు అరకిలో మీటర్ మేర వున్న ఫలంగా డీజిల్ లీకైంది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న దాదాపు 25 మంది విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులను ఇళ్లకు తరలిస్తున్న క్రమంలో శ్రీనివాస థియేటర్ నుండి మేళాపురం కూడలి వరకు బస్సులో డీజిల్ లీకేజి అయింది. స్థానికులు గమనించి కేకలు వేయడంతో డ్రైవర్ బస్సు ఆపాడు. వెంటనే బస్సులో వున్న విద్యార్థులను స్థానికులు కిందకు దింపారు. డీజిల్ లీకేజి అవుతున్న క్రమంలో నిప్పు రాజుకుని వుంటే పెనుప్రమాదం సంభవించేది. తమ పిల్లల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు జరిగిన ఘటన చూసి భయాందోళనకు గురయ్యారు.


సురక్షితంగా బయటపడిన విద్యార్థులు

## తహశీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్


తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శిస్తున్న సబ్ కలెక్టర్

**గుడిబండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : తహశీల్దారు కార్యాలయంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రాళ్లపల్లి, పిల్లేనహళ్లి గ్రామ పంచాయితీ రైతులకు సంబంధించిన భూములు కర్ణాటక రాష్ట్రం పావగడ నియోజకవర్గంలోని చెరువులకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఎత్తినహొళ్లె పథకం ద్వారా నీటి సరఫరాచేసేందుకు భూములు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతులకు నష్టపరిహారం విషయమై రికార్డులను పరిశీలించడానికి గుడిబండ తహశీల్దారు కార్యాలయానికి రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగభూషణం, భూ సర్వే డిప్యూటీ తహశీల్దారు రాంభూపాల్‌రెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మహ్మద్ బిలాల్, మండల సర్వేయర్ పుట్టరాజు విఆర్‌ఓలు, తదితర తహశీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమి పాఠశాలలను మూసివేసే యత్నాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్

**కొత్తచెరువు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** : ప్రాథమిక పాఠశాలలను మూసి వేసే యత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. 10 మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను ప్రభుత్వం సమీపంలోని పాఠశాలలతో విలీనం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్ తెలియజేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా ఎపిటిఎఫ్ సబ్ కమిటీ సమావేశంను జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోనంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేయడం నచ్చక విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లోకి చేర్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాథమిక పాఠశాలలను మూసి వేసే ఆలోచనను విరమించుకోవాలని, లేకుంటే భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పిన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్ దారులకు ప్రతి నెలా 1వ తేదిన జీతాలు చెల్లించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలు, పిఆర్‌సి బకాయిలు, వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం హుందాగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ముత్యాలప్ప, గౌరవ అధ్యక్షులు పి.వి.మాధవ, ప్రధాన కార్యదర్శి టి.త్రిమూర్తి, జిల్లా కార్యదర్శి ఆర్.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు చింతచెట్లు వేలం పాట

**గుడిబండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** : మండలంలోని మోరుబాగిలు, గుణేమోరుబాగిలు గ్రామ పంచాయితీలోని చింతచెట్లకు నేడు బహిరంగ వేలంపాట నిర్వహించబడుతుందని పంచాయితీ కార్యదర్శిలు రమేష్, దాదాఖలందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయితీ వారు నిర్ణయించిన 1000 రూపాయలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని అలాగే వేలంపాటలో పాల్గొనేవారు పంచాయితీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని పంచాయితీ షరతులకు లోబడి వేలంపాట నిర్వహించబడుతుందని కావున అర్హులైన ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు

**కొత్తచెరువు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** : మండల కేంద్రంలోని నారాయణ పాఠశాల నందు మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిభింబిస్తూ వివిధ దేశాల వేషధారణలతో విద్యార్థులు వచ్చి పలు భాషల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మాతృభాష యొక్క గొప్పతనం గురించి వివరించారు. విదేశీ భాషలు నేర్చుకోవడంలో తప్పులేదని, కానీ, వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


వివిధ వేషధారణలో విద్యార్థులు

# చిరుధాన్యాలు పండించండి సిరులను అందుకోండి-జిల్లా వ్యవసాయాధికారి

బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

చిరుధాన్యాలు పండిచండి సిరులను అందుకోండని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ పిలుపునిచ్చా రు.మంగళవారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని ఓబులాపురం గ్రామంలో నిర్వహించిన క్లస్టర్ స్థాయిలో అమలు అవుతున్న వేరుశనగ పొలంబడిని పరిశీలించడానికి వచ్చిన ఆయన రైతులను ఉద్దేశించి మాట్ల డుతు రైతులందరు వేరుశనగ వరి మాత్రమే ఎక్కువగా పడించుచున్నారని వీటికి వాతావరణంలో మార్పుల వలనాఎట్టు బడులు అధికంకావడం వలన కూలీలు లభించక ఎరువులు పురుగమందుల ధరల పెరుగుదలవలన దిగుబడులు తగ్గిపోవడంజరుగుచున్నది.రైతులందరు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ,వరి బదులుగా చిరుధాన్యాలు జొన్న,సజ్జ,రాగులు పండించుకోవాలన్నారు.తద్వార ప్రభుత్వం కూడ గిట్టుబాటుధరలను కల్పి స్తుందన్నారు.రైతుభరోసా కేంద్రాల ద్వారా మద్దతుధరతో కొనుగోలు చేస్తుం దన్నారు.అంతర్జాతీయ చిరుధా న్యాల సంవత్సరం కారణంగా విద్యార్థులకుకూడ రాగిజావా ఇస్తుందని తెలియజేశారు.అనంతరం అనంతపురం ఎడిఎ వెంకటరాముడు మాట్లడుతు క్లస్టర్ స్థాయిలో ఉన్న రైతులందరు విత్తన ధ్రువీకరణ సంస్థ వారిచే వేరుశనగను సర్టిపైచేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు జిల్లావనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శంకర్‌లాల్,[ శీనివాసులు,[ పవీణ్,రుమానాబేగం, మండల వ్యవసాయశాఖ అధికారి శ్యామ్‌సుం దర్‌రెడ్డి,రైతు భరోసా కేంద్రం ఇంచార్జిలు,విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారి రవి రైతులు తదితిరులు పాల్గొన్నారు.



మాట్లడుతున్న జిల్లావ్యవసాయాదికారి చంద్రనాయక్

# ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ముందుకెళ్ళండి
## - ఎంపీపీ భోగాతి, జడ్పీటీసీ లావనూరు

పామిడి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందని అధికారులంతా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగాలని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు లావనూరు శోభామధుసూదన్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపిడిఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఈక్రమంలో ఆయన అన్నివర్గాల ఆర్థికాభివృద్ధికి చేయూతను అందిస్తున్నారని తెలిపారు. అధికారులు ప్రజాప్రతి నిధులు సమన్వయంతో సంక్షేమ పథకాలను ప్రజల ధరికి చేరుస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పైలెట్ ప్రాజెక్టు గ్రామమైన రామరాజుపల్లిలో భూముల రీ సర్వేను త్వరతగతిన పూర్తి చేయాలని కోరిన ప్రజాప్రతినిధులు భూముల సర్వే చేయాలని కోరితే కాలయాపన చేస్తూ డబ్బులిస్తేనే సర్వే చేస్తున్నారని తెలియజేశారు. గ్రామాల్లో స్మశాన వాటికల స్థలాలను పరిరక్షిం చాలని కోరారు. సచివాలయాలకు ఉద్యోగులు సమయపాలన పాటించటం లేదని కొన్నిచోట్ల సచివాలయాలకు తాళాలు వేయటం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యాక్రమాలకు ప్రజాప్ర తినిధులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను తప్పకుండా ఆహ్వానించాలని ఆధికగా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలివ్వాలన్నారు. ఇదేక్రమంలో రైతులు పండించనున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు చేపడు తూనే ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. సమావేశంలో తహశీల్దార్ సునీతాబాయి, ఈఓఆర్‌డి శశికళ, హౌసింగ్ ఏఈ అశ్వర్థ, వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర, ట్రాన్స్-కో ఈఓ మధు సూదన్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి.

# గ్రామీణాభివృద్ధికి పాటుపడండి - సర్పంచులకు ఘనసన్మానం

పామిడి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

గ్రామీణాభివృద్ధికి పాటుపడాలని గ్రామపంచాయతీల సర్పంచులకు ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు లావనూరు శోభామధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రెండేళ్ళ పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సర్పంచులను మంగళవారం మండల పరిషత్ కార్యాలయం నందు ఘనంగా సన్మానించారు. ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈనేపధ్యంలో జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించాలన్న ఉద్దేశ్యంతో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పించి ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజల ధరికి చేరుస్తోందన్నారు. గ్రామపంచాయతీ సర్పంచులుగా ఎన్నికైన మీరంతా రెండేళ్ళ పదవీకాలాన్ని పూర్తి చేసుకోవటం అభినందనీయం అని అధికారుల సమన్వయంతో అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈకార్యక్రమంలో తహశీ ల్దార్ సునీతాబాయి, ఎంపి డిఓ ప్రభాకర్, ఈఓ ఆర్‌డి శశికళ, హౌసింగ్ ఏఈ అశ్వర్థ, వ్యవసాయ అధికా రిణి లీనా వసుంధర, ట్రాన్స్-కో ఈఓ మధు సూ దన్, వైస్ఎంపీపీలు నక్కా సౌభాగ్యమ్మ, కాయల మహేష్, ఎంపిటీ సీ సభ్యులు మజ్జిగ రాజశేఖర్, వైసీపీ రూరల్ కన్వీనర్ పాళ్యం నారాయణరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి లావనూరు మధుసూదన్‌రెడ్డి, పట్టణ, రూరల్ సచివాలయ కన్వీనర్లు బిబిఎస్ ఆసిఫ్, ఎన్ఆర్ఐ కుమార్‌రెడ్డి, నాయకులు జోజోడే కుమార్, హరినాథ్‌రెడ్డి, నీలూరు రమణారెడ్డి, నక్కా ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచులను సన్మానిస్తున్న దృశ్యం.

# సాహిత్యానికి సచ్ఛీలతే ప్రాణం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

సాహితాయంలో ప్రవేశానికి ద్వారం భాష, సచ్ఛీలత సాహిత్యానికి ప్రాణం కావాలి అని చం. స్పందన 2021 జీవన సాఫల్య పురస్కారం అందుకున్న సందర్భంగా సుప్రసిద్ద కవి, విమర్శకులైన దర్భశయనం శ్రీనివాసాచార్య అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాల్‌లో తెలుగు శాఖ, స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలోనాలుగు దశాబ్దాల సాహితీ జీవితంలో పది కవిత సంపుటాలు వెలువరించిన దర్భశయం శ్రీనివాసా చార్యకు స్పందన అంనత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర్ శాస్త్రి జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. మాతృభాషను క్షుణ్ణంగా నేర్చు కోవడం ద్వారానే ఆంగ్లంలో పట్టు సాధించి ప్రపంచ భాషల సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ గొప్ప కవిగా ఎదిగిన దర్భశయనంకు జీవన సాఫల్య పురస్కారం అందజేయగలగడం స ంపదన సంస్థకు గర్వకారణమని ఆ సంస్థ అధ్యక్షులు రాజారామ్ తెలియజేశారు. డా.బి.హేమామాలిని అధ్యక్షత వహిం చిన ఈ పురస్కార ప్రదాన సభలో సాహిత్య వేత్తలు డా.శాంతి నారాయణ, డా.రాద్యే, డా.అంకె శ్రీనివాస్, డా.యోగేశ్వర నాయుడు, అంకె మదన్ మోహన్, తరళజ్యోత్స్న, మధుర, అమర్‌నాథ్‌రెడ్డి, షేక్ నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందజేస్తున్న స్పందన సభ్యులు

# ఎద్దులపల్లిలో పేకాటకేంద్రం
## - అధికారపార్టీ అండదండలతో రూ.లక్షల్లో లావాదేవీలు - జోరుగా కర్ణాటక మద్యం, నాటుసారా, గుట్కా విక్రయాలు - యథేశ్చగా ఆన్‌లైన్ మట్కా అసాంఘీక కార్యకళాపాలు

పామిడి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

మండలంలో గుట్కా, నాటుసారా, కర్ణాటక అక్రమ మద్యం విక్రయాలు, అన్‌లైన్ మట్కా జోరుగా సాగుతుండటం ద్వార అసాంఘీక కార్యకళాపాలు యథేశ్చగా కొనసాగుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ మద్యం, గుట్కా వంటి మత్తు పదార్థాలు కర్ణాటక ప్రాంతం నుండి ఇక్కడికి దిగుమతి చేసుకుంటున్న కొందరు వ్యక్తులు వాటిని పలుచోట్ల ధుఖానాల్లో గుట్టచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్టు సమాచారం. ఇక పట్టణం, పల్లెల్లో నాటుసారా ఘాటు గుప్పుమంటుండగా వాటి క్రయవిక్రయాలు కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో జిల్లాలోని గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, హిందూపురం, కనేకల్లు, బెళుగుప్ప, పెనుగొండ, కళ్యాణదుర్గం ఇతరత్ర ప్రాంతాల్లో మట్కా కంపెనీలు విచ్చలవిడిగా వెలిసిన విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుత నేపద్యంలో ఇక్కడ ఆన్‌లైన్ ద్వార మట్కా విచ్చలవిడిగా కొనసాగుతుందని 'ఓపెన్ ఊరోకోనివ్వదు.. క్లోజ్ నిద్రపోనివ్వదు' అన్న చందంగా ఆన్‌లైన్ మట్కా మత్తులో యువత తమ భవిష్యత్తును అందకారం చేసుకుంటుందన్నది పలువురి వాదన. ఇకపోతే ఎద్దులపల్లి కేంద్రంగా గ్రామానికి సమీపంలోని గుట్టలు, ముళ్ళపొదల్లో పేకాటకేంద్రం నడుస్తుండగా దాని నిర్వాహకులకు అధికారపార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఓ పోలీసు అధికారికి కూడా ఈవిషయం తెలిసినప్పటికీ పేకాటకేంద్రాన్ని నిర్మూలించకుండా వారికి సహకరించి మామూళ్ళను దండుకున్నట్లు పోలీస్ వర్గాలే గుసగుసలాడుతుండటం గమనార్హం. ఇప్పటికీ కొనసాగుతున్న పేకాటకేంద్రం ద్వార రూ.లక్షల లావాదేవీలు జరుగుతున్నాయని నిర్వాహకులు పేకాటరాయుళ్ళ నుండి డబ్బుల వసూళ్ళకు ముగ్గురు వ్యక్తులను నియమించుకున్నట్లు పలువురు వాఖ్యానిస్తున్నారు. అధికారపార్టీ నాయకుల అండదండలతో పేకాటకేంద్రాన్ని యథేశ్చగా కొనసాగిస్తున్న నిర్వాహకులు పామిడి ఎద్దులపల్లి రోడ్డు, సొరకాయలపేట, ఎద్దులపల్లి పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ తమ మనుషులను ఉంచి పోలీసులు అటువైపుగా వెళ్తే వారిరాక సమాచారాన్ని తమ మనుషుల ద్వార తెలుసుకుని పోలీసులు వెళ్ళేలోపు పేకాటకేంద్రం స్థావరాన్ని మరోచోటికి మార్చివేస్తుండటంతో ఎలాగైన ఎద్దులపల్లి పేకాటకేంద్రాన్ని నిర్మూలించాలన్న ప్రస్తుత పామిడి పోలీసు అధికారుల ప్రయత్నాలు విఫలం అవుతున్నట్లు సమాచారం. మరి పోలీసులు గుట్కా, నాటుసారా, కర్ణాటక అక్రమ మద్యం విక్రయాలు, అన్‌లైన్ మట్కాపై దృష్టిని సారించి వాటిని అరికడుతూనే రూ.లక్షల్లో లావాదేవీలు నడుస్తున్న ఎద్దులపల్లి పేకాటకేంద్రంపై దాడులు నిర్వహించి దాని నిర్వాహకులు, వారి ఇన్‌ఫార్మర్ వ్యవస్థ, వారికి సహకరిస్తున్న అధికారపార్టీ నాయకులపై చర్యలు తీసుకుంటారా.. లేదా.. అన్నది వేచిచూడాల్సిందే.

# అప్పర్ భద్రకు కేంద్ర బడ్జెట్‌లో 5,350 కోట్లు కేటాయించడం అన్యాయం
## - జాతీయ ప్రాజెక్టు పోలవరంకు మొండి చేయి చూపడము దారుణం

అనంతపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త బ్యూరో

కేంద్ర విభజన చట్టంములో జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టునకు నిధులు కేటాయించక పోవడము కేంద్రము సవతి తల్లి ప్రేమ ఒలకపోయడము దారుణం అని మాజీ రాష్ట్రఎగ్జిక్యూటివ్ సభ్యులు టిసి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ.. అప్పర్ భద్రకు బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయడము రాజకీయ దురుద్దేశ్యముగా కేంద్రం నిరూపించుకున్నదన్నారు. అప్పర్ భద్ర సుప్రీం కోర్టులో ఉన్న ప్రాజెక్టునకు 5,350 కోట్లు కేటాయించడం అన్యాయము. పోలవరం ఆంధ్రులకు వరమైన పోలవరం ప్రాజెక్టునకు 40వేల కోట్లు నిధులు కేటాయించి ప్రాజెక్టు పనులను 2024 నాటికి పూర్తి చేయాలని కోరుతూ, వివాదములో ఉన్న అప్పర్ భద్ర నిధులను రద్దు చేయాలని కోరుటూ, అల్మట్టి డ్యాం ఎత్తు పెంచుటచే తెలుగు రాష్ట్రాలు 100 టీఎంసీల నీరు కోల్పోయినారన్నారు. అప్పర్ భద్ర పూర్తి అయినచో 38 టీఎంసీలు రాయలసీమ ప్రాంతము కోల్పోవునని, రాయలసీమ ఎడారిగా మారిపోవునని, కావున వెంటనే రాయలసీమ రైతు సోదరులు అన్యాయాన్ని ఎదిరించి, పోరాటలకు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో దూదేకులకు అన్యాయం
## - నూర్ బాషా దూదేకుల సంఘం వ్యవస్థాపకులు నూర్ మహ్మద్



మాట్లాడుతున్న దూదేకుల నూర్ బాషా వ్యవస్థాపకులు నూర్ మహ్మద్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన 16 ఎమ్మెల్సీ పదవుల అభ్యర్థుల ఎంపికలో దూదేకుల సామాజిక వర్గానికి చెందిన ఏ ఒక్కరికీ ఇవ్వకపోవడం అన్యాయం అని నూర్ బాషా దూదేకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ మహ్మద్ పేర్కొ న్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాటాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది దూదేకుల కులస్తులు ఉన్నారన్నారు. అయితే దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తారనే నమ్మకంతో గత ఎన్నికల్లో మా వర్గ ప్రజలంతా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాడానికి, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపుకు కష్టపడి పని చేశామన్నారు. అదే విధంగా.. ముస్లిం మైనార్టీ జనాభా అత్యధికంగా ఉన్న అనంతపురం అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని కచ్చితంగా ముస్లిం మైనార్టీలకే వచ్చే ఎన్నికల్లో కేటాయించాలని నూర్ మహ్మద్ కోరారు. నగరంలో దాదాపు 60వేల మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు ఓటముల్లో శాసిస్తారన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధ్య క్షులు నబీరసూల్, గౌరవ అధ్యక్షులు పి.నిజామ్, నాయకులు డి.మ స్తాన్‌వలి, రామాం జినేయులు, గౌస్‌పీరా, అలీబాబా, గౌను, దాదా ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం
## - సీమ సమస్యలపై మండలిలో గళం వినిపిస్తాం - బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవేంద్ర నగరూరు

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

రాయలసీమ అభివృద్ధి బిజెపితోనే సాధ్యమవుతుందని రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి రాఘవేంద్ర నగరూరు పేర్కొన్నారు. భారతీయ జనతాపార్టీ రాయల సీమ పట్టభద్రుల అభ్యర్థిగా రాఘవేంద్ర నగరూరు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి బిజెపి నేతలతో కలిసి నామినేషన్‌ను అందించారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, మాజీ శాసన సభ్యులు పార్థసారధి, రాష్ట్రప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొ న్నా రు. అట్టహాసంగా నామినేషన్‌లు దాఖలు కార్యక్రమానికి బిజెపి నేతలతో కలిసి పెద్ద ఎత్తున పార్టీ కార్యక ర్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైదన్నారు. శాసన మండలి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ది చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే రాయలసీమ సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో శ్రీలంకకు మించి ఆర్థిక లోటు ఉందని, అలాంటి పాలన పోవాలంటే బిజెపి పాలన రావాలని వారు ఆకాంక్షించారు. రా యలసీమ ప్రజలు ఆలోచించి, రాయలసీమ అభివృద్ధికై బిజెపికి ఓటు వేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్ర మౌలి, రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, రాయలసీమ జిల్లాల బిజెపి అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, ఎల్లారెడ్డి, రామ స్వామి, వజ్రభాస్కర్‌రెడ్డి, గుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు అంకాల్‌రెడ్డి, వసుందర, లలిత్‌కుమార , యువమోర్చ జిల్లా అధ్యక్షులు అశో క్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, సూర్యప్రకాష్, లక్ష్మినా రాయణ, విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవేంద్ర

# విశ్వవిద్యాలయాల్లో హోమాలు సిగ్గు చేటు
## - శాస్త్రీయతను పెంచాలి.. మూడు నమ్మకాలు కాదు సాకే హరి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను బోధించే అధ్యాపకులు మూఢ నమ్మకాలను పాటించడం సిగ్గు చేటని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి మండి పడ్డారు. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు హోమాలు, మూఢాచారాలకు వ్యతిరేకంగా జేఏసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం సాకే హరి విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్కేయూనివర్సిటీలో విసి ర ఆమకృష్ణారెడ్డి కుల, మతాలను రెచ్చగొట్టేలా యాగాలు, హోమాలు నిర్వహించడాన్ని పూర్తిగా తప్పుపట్టుతున్నామన్నారు. వర్సిటీలో వరుసగా ఉద్యోగులు మృతి చెందుతున్నారని మరణాలు అడ్డుకోవడానికే మృత్యుంజయ హోమం చేస్తున్నామని చెప్పడం విసి స్థాయికే కలంకితమన్నారు. వర్సిటీ విసి, రిజిస్టర్ మత్యుంజయ హోమాన్ని ఆపాలని లేదంటే భౌతిక శాస్త్రీయత నిరూపించడంలో భాగంగా ఆపి తీరుతామన్నారు. శాస్త్రీయ బద్దమైన పోరాటాలకు మేధావులు, విద్యా వంతులు, ప్రజాస్వామిక వాదులు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు రేకలకుంట రామాంజినేయులు, వరికూటి కాటమయ్య, కొర్రపాడు నాగేంద్ర, చెన్నకేశవ, దొడి ఈశ్వరయ్య, కుమార్, శ్రీరాముఉల, జానకీ రామ్ పాల్గొన్నారు.

# సిఎం జగన్‌కు బిసి సంక్షేమ సంఘం తరుపున కృతజ్ఞతలు
## బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు

అనంతపురం రూరల్,ఫిబ్రవరి21ప్రభాతవార్త:

రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత కల్పించి వారికి రాజ్యాధికారం కల్పించిన ఘనం సిఎం వైఎస్.జగన్‌మోహ న్‌రెడ్డికే దక్కుతుందని అదే విధంగా ఎమ్మెల్సీ స్థానాల్లో బిసిలకు అధిక సీట్లు కేటాయించి బిసిలకు పెద్దపీట వేయడంతో వైఎస్సా ఆర్‌సిపి చరిత్రలో నిలిచి పోతుందని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చి హామీ మేరకు చట్ట సభల్లో బడుగు బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.చట్ట సభల్లో ప్రాధాన్యత లేని కులాలకు కూడా స్వాతంత్ర్య భారత దేశ చరిత్రలో తొలిసారిగా శాసన మండలి సభ్యులుగా బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్య త కల్పించి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బిసి వర్గాల బాంధవు డిగా చరిత్రలో నిలిచారన్నారు. టిడిపి బడుగు బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకోవడం జరుగుతుంది తప్ప బడుగు బలహీన వర్గాలకు ఏనాడు రాజకీయంగా ప్రాధాన్యత ఇచ్చి పాపన పోలేదని కాని సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అలా కాకుండా బిసిల ను బ్యాక్‌బోన్ క్యాస్టులుగా గుర్తిస్తూ వార్డు సభ్యుల నుంచి రాజ్యసభ సభ్యుల వరకు బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తూండంతో సిఎం జగన్‌మోహన్ వెంట బడుగు బలహీన వర్గాలు అన్ని నడవడం జరుగుతుందన్నారు.రాష్ట్రంలో ఎమ్మెల్సీ స్థానాల్లో బిసిలకు అధిక ప్రాధాన్యత కల్పించడంతో పాటు వడ్డేర జాతికి చెందిన ఏసు రత్నం ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం జరిగిందని అదే విధంగా వడ్డీల జాతికి చెందిన జయమంగళ వెంకటరమణకు లోకల్ కోటా కింద ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి రాష్ట్రంలోని వడ్డేర్లను గురించి వడ్డేర్లకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వడంతో పాటు బిసిలకు పెద్ద పీట వేసిన సిఎం జగన్‌మో హన్‌రెడ్డికి వడ్డేర్ల తరుపున,అదే విధంగా బిసి సంక్షేమ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందని అదే విధంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన బోయ మంగమ్మకు శుభాకాంక్షలు తెలియజే యడం జరుగుతుందని జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు తెలిపారు.



వడ్డే శ్రీనివాసులు

# జనసేన పార్టీ కార్యాలయానికి సంవత్సరం అద్దె వితరణ
## - పార్టీ బలోపేతానికి పత్తి చంద్రశేఖర్ విశేష కృషి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

జనసేన పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా నని జనసేన జిల్లా ప్రధాన కార్య దర్శి పుట్టపర్తి నియోజకవర్గ బాధ్యులు పత్తి చంద్రశేకర్ పేర్కొన్నారు. అందులోభాగంగా ఓడిసి మండల ంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయ నిర్వహ ణకు ఒక సంవత్సరం పాటు అద్దెను అందించేందుకు పత్తి చంద్రశేఖర్ ముందుకు వచ్చారు. జనసేన మండల అధ్యక్షులు మేకల ఈశ్వర్, ఉపాధ్యక్షులు కొండ బోయిన సతీష్‌కి నగదును అందజేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఉమ్మడి అనంతపూర్ జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ జెండా ఎగురవేసేలా కృషి చేయాలని చంద్రశేఖర్ పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పత్తి చంద్ర శేఖర్‌ను ఘనంగా సత్కరించి, మీ సారథ్యంలోపుట్టపర్తి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.



జనసేన కార్యాలయానికి సంవత్సరం అద్దె అందజేస్తున్న పత్తి చంద్రశేఖర్

# ఏప్రిల్ 9, 10 తేదీల్లో 48 గంటల వరల్డ్ రికార్డు కార్యక్రమం

అనంతపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త బ్యూరో

శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్య ంలో శ్రీశ్రీ కళావేదిక, చేజెర్ల ఇంద్రాణి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో 48 గంటల వరల్డ్ రికార్డు కార్యక్రమం ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహణ గురించి తిరుపతిలో చర్చించినట్లు అంతర్జాతీయ గౌరవాధ్యక్షులు కింగ్ ఇంద్ర, ఏపి రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మోత్సవ ప్రోగ్రామ్ కన్వీనర్ గుత్తా హరి సర్వోత్తమ నాయుడులు తెలియజేశారు.



కింగ్ ఇంద్ర, గుత్తా హరి సర్వోత్తమ నాయుడు

# గ్రామాల్లో టిడిపి ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి స్థానికి తెదేపా మద్దతుతో పోటీ చేస్తున్న భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డిని గెలిపించాలని మండల టిడిపి నాయకులు మంగళవారం మండలంలోని గొరిదిండ్ల,ముట్టాల, పి.సిద్దరాం పురం, పి.యాలేరు, గ్రామాలల్లో ఇంటింటా గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి మెదటి ప్రాధాన్యత ఓటువేయ్యాలని అభ్యర్థించారు.మండల తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు,హిందుపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌చౌదరి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో మండలం గల పట్టుభద్రులను కలసి తెదేపా బలపరిచిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి స్థానాన్నికి మార్చి 13న జరుగు ఎన్నికల్లో రాంగోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసులు,క్లటర్ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్ చౌదరి,నాయీబ్రహణ ప్రతినిధి ఆనంద్,మహిళ నాయకరాలు పెద్దలక్ష్మమ్మ,చెన్నమ్మ, శ్రీనివాసరెడ్డి,శ్రీరాంరెడ్డి, నాగార్జున, భాస్కర్‌నాయక్, లక్ష్మినారాయణ,రవితేజ ,మురళి,రవి, రసింహచౌదరి,రామాంజినేయులు, నాగన్న,హనుమంతు, లోకనాథ్‌రెడ్డి,మెకానిక్ మహేస్,బొమ్మయ్య, రవితేజరెడ్డి, పాల ఓబుళపతి, బుట్టా శ్రీనివాసులు, జయశీల, మండల అధ్యక్షులు పూల ఓబుళపతి, రాందాసు, అక్కులప్ప, ఆద్దెప్ప,బాబా,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పి.యాలేరులో టిడిపి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

# అనంతపురంలో ఓలా ఎలక్ట్రిక్ మొదటి అనుభవ కేంద్రం ప్రారంభం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

భారతదేశపు అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాలు కంపెనీ ఓలా ఎలక్ట్రిక్, అనంతపురంలోని రుద్రంపేటలోని, కళ్యాణదుర్గం రోడ్‌లో కొత్త ఓలా ఎక్స్పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించడంతో అనంతపురంలో తన డి2సి ఫుట్ ప్రింట్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఇప్పటికే ఇటువంటి 200 ఎక్స్పీరియన్స్ సెంటర్లు కలిగి ఉండగా, కంపెనీ తన నెట్‌వర్క్‌ను మార్చి 2023 నాటికి 500 అవుట్లెట్లను చేర్చేందుకు చర్యలు తీసుకుంటోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అన్ని సేవలను ఒకే చోట అందించాలన్న లక్ష్యంతో, ఓలా ఎక్స్పీరియన్స్ సెంటర్లలో ఈవి ఔత్సాహికులు ఓలా అందుబాటులోకి తీసుకు వచ్చిన ఈవీ సాంకేతిక వివరాలు తెలుసుకునేందుకు, వాటి పనితీరును సొంతంగా తెలుసుకునే ందుకు అవకాశం కల్పిస్తుంది. వినియోగదారులు ఎస్1, ఎస్1 ప్రొటెస్ట్ రైడ్లను చేసేందుకు ఓలా డ్రాండ్ ఛాంపియన్ల నుంచి కొనుగోలుకు సహకారాన్ని అందుకునేందుకు, ఫైనాన్సింగ్ ఎంపికల వివరాలు తెలుసుకునేందుకు ఓలా యాప్‌లో వారి కొనుగోలు ప్రక్రిను పూర్తి చేసేందుకు కూడా అనుమతిస్తుంది. ఈ ఎక్స్పీరియన్స్ సెంటర్లు అన్ని పోస్టు సేల్స్ కేర్, ఓలా స్కూటర్ల నిర్వహణ కోసం వన్-స్టాప్ డెస్టినేషన్లుగా రెండింటి పనితీరును అందిస్తాయని వారు పేర్కొన్నారు.



ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్

# అక్రమంగా సేకరించి కర్ణాటకకు తరలిస్తు 11.37 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

అక్రమంగా సేకరించి కర్ణాటకకు తరలిస్తున్న 11.37 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపా రు. ఆటోతోపాటు డ్రైవర్‌ను పట్టుకుని 4వ పట్టణ పోలీసులకు అప్పగించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జ్ ఎస్పీ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం విఅండ్ఇ డిఎస్పీ జి.వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో సిఐ వి.వెంకటరమణ, డిసిటిఓ డి.విజయలక్ష్మి, సిబ్బంది జ్యోతి, సిఎస్‌డిటి రాప్తాడు మండలంలకు రాబడిన పక్కా సమాచారంతో మంగళవారం రాప్తాడు సర్కిల్ జాతీయ రహదారి 44వ రోడ్డు వద్ద దాడులు నిర్వహించడంతో పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నామాల శివ కళ్యాణ్ తండ్రి శ్రీనివా సులు, కక్కలపల్లి పంచాయితీ నివాసిను డ్రైవర్‌గాను, జగదీష్ సోమందే పల్లిను బియ్యం యజ మానిగా గుర్తించడమైంది. ప్రజా పంపిణీ బియ్యంను సేకరించి సోమందేపల్లి, అక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బ్లాక్‌మార్కెట్‌లో అధికర ధరలకు విక్రయి ంచాలనే ఉద్దేశ్యంతో అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.



అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

# మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ - తవ్వా వెంకటయ్య

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

మాతృభాషను కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిదని నెపం ఏ ఒక్కరి పైనో నెట్టి వేయడం సమంజసం కాదని అధికార భాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య అన్నారు. అంతరాజాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని అనంతపురం జిల్లా రచయితల సంఘం (అ.జి.ర.సం), కెఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కెఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలోజరిగిన మాతృభాష ప్రాముఖ్యత అనే అంశంపై జరిగిన సదస్సుకు ముఖ్య అతిథులుగా అధికార భాషా సంఘం సభ్యులు డా.తవ్వా వెంకటయ్య హాజరయ్యారు. సదస్సు నుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష నేడు అంతరించి పోయే పరిస్థితులలో ఉందని అందుకు మనమంతా బాధ్యులేనని అన్నారు. అనంతరం సాకే హరిమూర్తి, ఆలూరు రామిరెడ్డి, కె.సత్యనారాయణరావు, వసుందరా దేవిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి తోట నాగరాజు, కోశాధికారి సుంకన్న, రమేష్, ఉపాధ్యక్షులు అంకె రామలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాతృభాష దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

# ప్రొఫెసర్ రవీంద్రనాథ్ మృతికి సంతాపం

ఎస్కేయూ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

ఎస్కేయూ రసాయన శాస్త్ర విభాగంలో మాజీ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ సంతాప సభ నిర్వహించారు. విభాగానికి ప్రొఫెసర్ రవీంద్రనాథ్ చేసిన పనులు గురించి వక్తలు కొనియాడారు. కార్యక్రమంలోరెక్టార్ మల్లికార్జునరెడ్డి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధా కర్‌బాబు, ప్రొఫెసర్ రమణ, డాక్టర్ అనిత, పరీక్షల విభాగం డైరెక్టర్ రమణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ రవీంద్రనాథ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

CHANGE OF NAME

I, FAKRULLA SHOUKATH KHAN (old name) S/o SARWAR FAKRULLA KHAN, 5-11-531/2 CPI Colony, Hindupur, Sri Satya Sai Dist, Andhra Pradesh-515201. Changing My Name From FAKRULLA SHOUKATH KHAN (Old Name) To **FAKRULLA SHOWKATH KHAN** (New Name). Hence forth, I am being called as **FAKRULLA SHOWKATH KHAN** for all purposes.

(TH_ATP)

